పల్లెటూరు పాలకులు

వి. యస్. అవధాని

దీపావళి పండగ వెళ్ళిన రెండో రోజున మోహన్ ఏం పని లేకుండానే బెజవాడ వెళ్ళాడు. ఒంటరిగా వెళితే బాగుండేదేమో!

తనంతట తను వెళ్ళడం అయితే ఒంటరిగానే వెళ్ళి ఉండేవాడు. కాని ప్రెసిడెంటూ, చౌదరయ్యా వచ్చి బెజవాడ వెళదాం రమ్మని పిలిచారు. తనూ అదివరకే వెళదామా వద్దా అని ఆలోచిస్తున్నాడేమో, వాళ్ళు రమ్మనమని పిలవగానే బయల్దేరాడు.

అసలే కార్తీకమాసం. అందులోనూ చలిగాలి జాస్తిగా ఉన్నది. ఐనా పొట్టిలాగూ పొడుగు చొక్కాలతో ఆరోజుల్లో రాత్రిపూట సినిమా చూడడానికి బెజవాడ వెళ్ళడం మోహానుకే తగును.

వెంటవచ్చిన ప్రెసిడెంటూ చౌదరయ్యా తమ పనులు చేసుకుని తిరుగు బాడికి ఇంటికి బయల్దేరారు. మోహానుకు ప్రత్యేకం పనిలేదు కనుక వాళ్ళ వెంబడి వాళ్ళు తిరుగుతున్నంత సేపూ తిరిగాడు. వాళ్ళు తిరిగి ఇంటికి బయల్దేరే సరికే వాన ప్రారంభమయింది.

ఆరోజుల్లో నాగయ్యగారి త్యాగయ్య బెజవాడలో దిగ్విజయంగా సాగుతోంది. తనకు సినిమా చూడాలని ఉన్నది. కాని వాళ్ళతో మొహమాటం లేకుండా నేను సినిమాకి వెళ్ళాలి అని చెప్పడం తన వేత కాలేదు. వాళ్ళు వెళతాం అని అన్నప్పుడు. "నాకు కొంచెం పనున్నది" అని బూకరించాడు. అట్లా అనడానికి కారణం లేకపోలేదు. సభ్యతను పాటించి చౌదరి కాకపోయినా ప్రెసిడెంటు తనతో బాటు ఆగుతాడని అనుకున్నాడు. కాని అనుకున్న దానికి వ్యతిరేకం అయింది.

అక్కడికి ప్రెసిడెంటు, చౌదరిని చూసి, "నువ్వు త్యాగయ్య చూడలేదుగా" అన్నాడు.

కాని, "ఏం త్యాగయ్య లేద్దూ, ఇంత వాన కురుస్తుంటేనూ" అన్నాడు చౌదరయ్య. అంతటితో మోహన్ వేసిన పాచిక వ్యర్థమయింది. వాళ్లు వెళ్ళిపోయారు. వాన దబాయించి కురుస్తోంది. తెచ్చిన గొడుగు ఉపయోగిస్తుందా లేదా అన్నంత భయం వేస్తోంది. ఈ భయానికి అతడి హృదయంలో చోటేదీ?

రోడ్డువెంబడి నడుస్తున్నాడు. ఎక్కడికి పోవాలో తనకు తెలియదు. పోయి చూడాల్సిన చుట్టాలు లేక కాదు; చూడడం అనే నెపంతో ఆ రాత్రికి తల దాచుకునే వీలు లేక కాదు.

నడుస్తుంటే కోపం వస్తోంది. ఏం చేసికోనూ ఆకోపం? తన కోపం ఎవడికి కావాలి? తనకు కోపం వచ్చిందని చౌదరికీ, ప్రెసిడెంటుకీ తెలుసా? ఎట్లా తెలుస్తుంది? "నాకు పని ఉన్నది" అని అనేటప్పుడు అక్కడికీ తను మొహం చిట్లించాడు. పరధ్యానంగా ఉన్నట్లు చూశాడు. చూస్తే ఏం ప్రయోజనం? అవన్నీ కోపం వచ్చినవాడే చేస్తాడని ఎక్కడ ఉన్నదీ? ఒకవేళ తనకు కోపం వచ్చిందని వాళ్ళకు తెలుసునే అనుకున్నా, తనను బ్రతిమాలాలిసిన అవసరం వాళ్ల కేమిటీ?— ఈ భావం కలిగేటప్పటికి అతడి కోపం మరీ జాస్తయింది.

తను వాళ్ళకు ఎంతో అవసరం. వాళ్ల ఊళ్లో బడి పాడుబడి ఉంటే- తను బి. యే. ప్యాసయినప్పటికీ ఎటువంటి గర్వం లేకుండా- వాళ్ల ఊరు వెళ్ళి ఆ బడిని బాగుచేశాడు. దాన్ని ఎంతో అభివృద్ధిలోకి తెచ్చాడు తెస్తే ఏం? వాళ్ళు జీతం ఇచ్చారు. ఇస్తున్నారు. వాళ్ళకు చేతనయిన గౌరవం చేస్తున్నారు. అంతకన్న చేసేదేముందీ? ఏ మనిషినయినా అవసరం వెంబడే ఈ సంఘం గౌరవిస్తుంది— ఈ సంగతి గుర్తుకు వచ్చేసరికి మోహానుకు కోపం తగ్గి భయం వేసింది.

ఇహ తన అవసరం వాళ్ళకు లేదా? లేకపోతే ఏం, తను బ్రతకలేడా? ఎక్కడికి పోయినా తనపని తాను చేసుకుంటే తనూ, తన కమలా హాయిగా బ్రతగ్గలరు. కాని ఈ కమల ప్రొద్దున– రేషనుగింజలదగ్గరికి వస్తున్నాయని ప్రెసిడెంటుగారి కోళ్ళను మంటిబెడ్డతో ఎందుకు కొట్టింది?

రేషనుబియ్యం ఎండబెట్టి కమల దంపిస్తుంది. చౌదరిగారు వడ్లబస్తా లిస్తానంటే మోహన్ వద్దన్నాడు. రేషను గింజలను బాగుచెయ్యడం, వండడం కష్టం అని కమల గోల పెడుతుంది. ఆ గోలతో తనను విసిగిస్తుంది. తనతోబాటు ఆమె విసుక్కుంటుంది. ఆ విసుగులో కోళ్ళమీద రాయి విసిరింది. అదిపోయి ఆ కోడి కాళ్ళకే తగలాలీ?

అంతా అయోమయంగా ఉంది. ఎంత ఆలోచించినా మనుష్యులు ఒకళ్ళతో ఒకళ్ళు ఎందుకు పోట్లాడుకుంటారో మోహానుకి అంతుపట్టడం లేదు. తనకు అంతు పడితే ఎంత, పట్టకపోతే ఎంత? తనకు అంతుపట్టినంతమాత్రాన వర్గకలహం ఆగుతుందా యేమిటి?

నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. చలిగాలి ఎక్కువయి వానచినుకులు గొడుగులోంచి వచ్చి మీదపడుతున్నాయి.ఆలోచనలతో తనుచస్తుంటే రిక్షావాలా ఒకడు తనను రాచుకుంటూ పోయాడు. ఎవడో ఒక కఱ్ఱవెధవ ఎదురుగా వస్తూ "కొంచెం ఫైర్ ఇప్పిస్తారా బాబూ"అన్నాడు. ఇప్పుడు తనే ఒక ఫైర్. తన్నే తీసుకుని వాడు బీడీ కాల్చుకుంటే సరి. వ్యర్థజీవి!

ఇంతలో ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. సినిమాకి టైం అయింది. తను వాళ్ళతో ఎందుకు వచ్చాడు? వాళ్లు తనను ఎందుకు పిలిచారు? పిలిచారు కనుక వచ్చాడు. వచ్చాడు కనుక చలికి బాధపడుతున్నాడు.

అతడిది చలిబాధ కాదు. తనలోని ఏదో ఒకటి వాళ్ల ప్రవర్తనవలన దెబ్బతిన్నది. ఏం తింటే? దానిసంగతి అది చూసుకోలేదూ?...లేదు. ప్రతిదానికీ తన పెత్తనం కావాలి?...ఎదురుగా ఒక కోడెదూడ ఎక్కడినుంచో పరుగెత్తుకుని వస్తోంది. తను పక్కకు తప్పుకున్నాడు. ఆదూడను చూడగానే గుండెలు దడదడా కొట్టుకున్నాయి. అది తనను పొడుస్తుందని కాదు. రెండు రోజుల క్రిందట ప్రెసిడెంటుగారి కోడె దూడ తన సొరతీగమీద పడుతుంటే త నొకపుల్ల విసిరి వేశాడు. అది పోయి దాని కన్నుకి తగిలింది. ఆ సాయంత్రం ప్రెసిడెంటుగారు జీతగాణ్ని గదమాయించడం తను విన్నాడు. ఈ దూడను చూడగానే ఆ దృశ్యం గుర్తుకు వచ్చింది. ఎందుకు వచ్చిందో! ఆరాత్రి రెండాటలూ సినిమా చూసేప్పటికి వాన దేవత కొంచెం శాంతించింది. వానకూడా ఒక దేవతేనా? అందరూ దేవతలే చేతగానివాడికి. చేతనయినవాడికో! వాడే దేవత... "ఛీఛీ... పాడు దేవతలు" అనుకుంటూ స్టేషన్ వైపువెళ్ళాడు. రాత్రల్లా జాగారంచేసి తెల్లవారి ఏడు గంటలకి ఇంటికి హాజరయాడు. అప్పటికి రెండుసార్లు తాగివున్నా మళ్లీ కమల యిచ్చిన కాఫీ తాగి ఏదో పుస్తకం చూస్తూ పడుకున్నాడు. ఆ పడుకోవడం సాయంత్రం అయిదు గంటలదాకా లేవలేదు.

అతడు పగలు పడుకోనే పడుకోడు, పడుకున్నా నిద్రరాదు. నిద్రవచ్చిందా కమల లేపదు. అది ఆమె నియమమేమో.

కాచిన కాఫీ చల్లారిపోతూ లేపుదామా వద్దా అని కమల ఆలోచిస్తుంటే, "మాస్టరుగారూ" అని బయటనుంచి పిలుపువచ్చింది.

"ఇహ లేవండి, ప్రెసిడెంటుగారు వచ్చారు" అన్నది కమల.

"రండి" అంటూ మోహన్ లేచి ఇంకో గ్లాసు కాఫీ అన్నట్టు కమలవైపు చూస్తుంటే ప్రెసిడెంటుగారు "ఇంకా ఇప్పుడు కాఫీ తాగుతున్నారేం!" అన్నారు.

"ఇప్పుడే నిద్రలేచానండీ. మీరుకూడా..."

"అబ్బే, అక్కరలేదండీ...ఇందాకటినుంచీ మీకోసం చూశాం. వెంకటేశ్వర్లును పంపితే తమరు నిద్రపోతున్నారని చెప్పాడు."

"ఏం సంగతి?"

"అబ్బే. ఏమున్నదీ? కమిటీ మీటింగు జరిగింది."

"అట్లాగా. నాకు తెలియనే తెలియదండీ, తెలిస్తే రాకుండా ఉంటానా? ఏమేం అనుకున్నారూ?"

"విశేషాలేమీ లేవు. అన్నీ మీరు చెప్పినవే పాసుచేశాం...మా రామయ్య మొన్ననే ట్రయినింగ్ పాసయాడు. ఎక్కడా ఉద్యోగం దొరక్క బాధ పడుతున్నాడు. వాణ్ణి మన స్కూల్లో వేసుకున్నాం."

"వారిని ఎవరికి బదులు వేసుకున్నారు?"

"కొత్త పోస్టేమీ లేదుగా. మీకు బదులుగానే వేశాం. మీరు అచ్చంగా ట్యూషన్లు చెప్పాలని సాహూ చౌదరికీ ఉన్నది. మామూలు కేం లోపం రాదు."

"లోపానికేం కానీండి. నేను ట్యూషన్లు చెప్పలేను. కొంతకాలం రెస్టు కావాలి."

"అదంతా ఇహ మీయిష్టం, వస్తా"నంటూ ప్రెసిడెంటు వెళ్లిపోయాడు.

* * *

అమావాస్య రాత్రి. పల్లెటూళ్లలో వానకురిసిన రాత్రి ఒక్క పురుగుకూడా ప్రొద్దు క్రుంకగానే బయటికి రాదు. ఊరంతా ఖరద ఖరదగా ఉంటుంది. అయినా పని ఉన్నవాళ్ళు తిరగడం మానరా? మోహానుకు పని లేకపోయినా నిద్ర రాదు. అంత పెందరాళే రాదు. పైగా ఆలోచనలు- ఈ ఆలోచనలకు తను తప్ప దొరకనట్టు తననే వేధిస్తాయి. తనేమో ఆ ఆలోచనలు చెప్పినట్టు చెయ్యలేదు. చెయ్యడానికి ప్రయత్నిస్తుంటే అనేక ఇబ్బందులు. అసలు అట్లాంటి ఆలోచనలు ఎందుకు రావాలి? ఉన్న యథార్థతను గుర్తిస్తున్నాడు కనుక ఆలోచనలు వస్తున్నాయి. ఆలోచనలు వచ్చినట్టు చేయగలగడానికి ప్రయత్నిస్తున్నాడు కనుక ఇబ్బందులు వస్తున్నాయి. ఇబ్బందులనే అలవాటుగా భావించి- వాటిపట్ల నిర్లిప్తంగా ఉండడం తనకు చేతనయితే బాగుండును. కాని అది చేతకాందే? మోహాన్ పక్క మీద అటూ ఇటూ దొర్లాడు. కిటికీ తెరిచాడు. 'బిగ్ బెన్' పదకొండు గంటలను చూపింది. అయినా నిద్రరాదు. నిద్రపోవడానికి తను చేసిన ప్రయత్నం ఏమిటి? బోర్లపక్కలా పడుకుని శాలువా కప్పుకున్నాడు...అహా...నిద్ర రాదు.

ఉద్యోగం పోయి ఆరు నెల లయింది. ట్యూషన్లూ మానివేశాడు. వాళ్ళ పిల్లలు వస్తే "నాకు ఒంట్లో సరిగ్గా లేదు, నేను మళ్ళీ రమ్మనమనేదాకా రావద్దు" అని చెప్పాడు. అప్పుడప్పుడు కమల దాచి నిలువ చేసిన చిల్లరతో సహా అంతా ఖాళీ అయింది. రాఘవయ్య కొట్లో నలభయి రూపాయిలు అప్పయింది. ఇవన్నీ ఎట్లా తీరుతాయి? ఏం తీరకపోతే? వాళ్లు బజార్లో నిలవేస్తే? ఎందుకు నిలవేస్తారు? వాళ్ళ డబ్బు ఇవ్వలేదు కనుక...

సమాధానాలు దొరకని ప్రశ్నలు మనసును కలవరపెట్టాయి. పెద్దపెట్టున గాలి వచ్చింది. కాసేపట్లో జోరుగా వాన సాగింది. మోహానుకి కొంచెం నిద్ర పట్టింది.

మెలకువ వచ్చి చూసేసరికి లాంతరు ఆరిపోయింది. పక్కని టేబిల్ మీద బ్యాటరీ లైటుండాలి. దానికోసం వెదికితే అది కనిపించలేదు. కొంచెం నెమ్మదిగా అటూ ఇటూ తిరుగుతుంటే నిప్పుపెట్టె కాళ్ళకు తగిలింది. గుండె వేగంగా కొట్టుకుంటున్నా, కాళ్లు తడబడుతున్నా, చేతులు వణుకుతున్నా నెమ్మదిగా ఆ నిప్పుపెట్టెను తియ్యబోయేసరికి కాళ్ళకు రాళ్లు తగిలాయి. ఒకపుల్ల గీసేసరికి ఎదురుగా వున్న తలుపు పక్కగా ఒక కన్నం ఉన్నట్టు మోహానుకి తెలిసింది.

మెల్లగా కమల మంచం దగ్గరకుపోయి ఆమెను లేపాడు. ఉలిక్కిపడుతూ లేస్తూ "అప్పుడే లేచారేమండీ?" అన్నది. మరుక్షణమే ఇంట్లో దీపం లేకపోవడంవల్ల ఒకరకమైన భయమూ, ఎదురుగా కన్నం కనిపిస్తున్నందువలన అంతకన్న ఎక్కువ భయమూ ఆవరించగా "అమ్మో... ఇదేమిటండీ" అంటూనే మంచంమీద పడిపోయింది. ఇహ ఇంట్లో ఎవరూ లేరు కనుక ఎవరికీ ఆ సువార్త అందించాలిసిన అవసరం లేదు. కాబట్టి భయం వేస్తున్నా తప్పక అటూ ఇటూ తడుముకుంటూ పోయి బెడ్ లైటును సాధించి వెలిగించాడు. సంగతంతా తెలిసింది కాబట్టి భయం సెలవు తీసుకుంది. మంచంకింద ఉండాలిసిన మంచినీళ్ల వెండి చెంబు లేదు. కమల మొహాన కాసిని నీళ్లు కొడితేనేగాని తిరిగి ఈ లోకంలోకి రాదు. నీళ్లు ఎక్కడున్నాయోనని వెదుక్కుంటూ పోయి నాలుగయిదుసార్లు కింద పడ్డాడు. నీళ్ళుండడానికి బిందె ఉంటేనా! అటూ, ఇటూ 'తోచీ తోచక' తిరుగుతున్నాడు

అంతలో కమలకు ఫిట్ వదలిపోయినట్లు తెలిసింది. మళ్లీ ఎక్కడ విరుచుకు పడుతుందోనని ఆమెను దగ్గరికి లాక్కుని ఒజ్జగిస్తూ "మరేం భయం లేదు. తెల్లవారవచ్చింది" అన్నాడు గాద్గదికంతో. అవును, తెల్లవారవచ్చింది.

కొంచెంసేపయ్యాక లాంతరు వెలిగించి ఇద్దరూ ఇల్లంతా వెదికి చూశారు. తమ ఒంటిమీద గుడ్డలూ, తమరు పడుకున్న మంచాలూ,- ఇవీ మిగిలినయి. అన్నం వండుకుని వదిలిన గిన్నెల దగ్గరనుంచీ కమల వెండికంచం, చీరెలూ, పట్టా గొలుసులూ- అవీ ఇవీ-అన్నీ మాయమయ్యాయి.

తెల్లవారింది. మోహన్ దొడ్లోకి వెళ్లేటప్పటికి అక్కడ చాలామంది నుంచుని విడ్డూరంగా చూస్తున్నారు. పుస్తకాలపెట్టె, కమలచీరలూ సొమ్ములూ ఉండే పెట్టె-బయటపడేసివున్నాయి. పెట్టెల అడుగున వేసిన కాగితాలుతప్ప ఇంకా ఏం ఉంటయి?

జరిగిన సంగతి ప్రెసిడెంటుకూ, చౌదరికీ తెలిసింది. బళ్లో పిల్లలందరికీ తెలిసింది. ఆరోజు సోమవారం. బడి ఉన్నది. అయినా చాలామంది పిల్లలు బడి మానుకుని మోహన్ ఇంటిదగ్గర గుమిగూడారు. అందరితోనూ నవ్వుతూ అదో రకంగా మోహన్ మాట్లాడుతున్నాడు. కమల కాఫీ పెడదామని ప్రయత్నంచేసి ఇంట్లో గిన్నెలూ, కుంపటీకూడా లేవు కాబట్టి ఓమూల చాపవేసుకుని పడుకుని ఏమిటో ఆలోచిస్తోంది.

"అయితే మేష్టరుగారూ ... మీరు చాలా మెలుకువగా ఉంటారుగా ..." అన్నాడు ప్రెసిడెంటు.

"ఏం మెలుకువలెండి."

"ఆ...ఆ సమయం వచ్చేసరికి అట్లా ముంచుకొస్తుందయ్యా..." అన్నాడు చౌదరి. వరండాలో గుంపుగా ఉన్న పిల్లలను చూసి "ఇక్కడేం చేస్తున్నారోయ్? ఇహ పొండి." అన్నాడు ప్రెసిడెంటు.

కొంతమంది వెళుతున్నట్లు నటించి తిరిగి అక్కడే నిలబడ్డారు. ఒక ఆడపిల్ల వాళ్ల ఇంటిదగ్గరనుంచి కాఫీ తీసుకువచ్చి కమలచేత బలవంతాన తాగించింది.

వరండాలో ఈతాకుల చాపలమీద మునసబూ, ప్రెసిడెంటూ, చౌదరీ, కొంతమంది మేష్టర్లూ — కొంతమంది పిల్లలూ, అందరూ మోహన్ చుట్టూ కూర్చున్నారు.

"లక్ష్మయ్య పంతులుగారికోసం మోతాదును పంపించా. రాగానే రిపోర్టు రాద్దాం" అన్నాడు మునసబు చౌదరివైపు చూస్తూ.

"రిపోర్టు దేనికి?" అన్నాడు మోహన్.

"జరిగింది కన్నపు దొంగతనం. సుమారు ఓ వెయ్యి రూపాయల సొమ్ముదాకా పోయి ఉంటుంది. కాబట్టి రిపోర్టు చెయ్యాలిసిందే" అన్నాడు చౌదరి.

"దానివలన ప్రయోజనమేమిటి?" అన్నాడు మోహన్.

"ప్రయోజన మేమిటో మీకు చెప్పేటంత వాళ్ళమా మేము?" అన్నాడు ప్రెసిడెంటు.

"మీరు చెప్పాలని నాభావంకాదు. ప్రయోజనం మనకు లాభంగా ఉండదని నా అనుభవంలో నాకు తెలుసు. కాబట్టి రిపోర్టు చెయ్యవద్దు అని అంటున్నాను" అన్నాడు మోహన్. కొంచెంసేపు ఎవరూ ఏమీ మాటాడలేదు. ఈ నిశ్శబ్దం అక్కడ కూర్చున్న పెద్దవాళ్ళ నందరినీ అనేక విధాల బాధ పెటుతోంది. ఆబాధ వారి మనస్సుల్లో ప్రతిఫలించి ముఖాలలో తీవ్రతరూపంగా కనిపిస్తోంది.

"ఇంకా ఏం...చౌదరీ, మనవాళ్లను నలుగుర్ని పిలిపించి మాట్లాడు. తలో కాస్త వేసుకుని పంతులుగారి సొమ్ము అంతా కాకపోయినా కొంతయినా ఒప్పచెప్పాలిసిన బాధ్యత మనకు ఉందిగా" అన్నాడు ప్రెసిడెంటు. ఈ మాటలు విని చౌదరి మొహం చిట్లించుకొన్నాడు. "ఈ ప్రెసిడెంటుకి గొడవ దేనికి? ఈ పెత్తనం ఎవరు ఇచ్చారు ఈయనకు?" అనేభావం అతనిలో గిరగిరా తిరిగితిరిగి చివరికి ఒక రకమైన అనుమానాన్నీ, అసూయనూ కలిగించింది. ఐనా అదేమీ కనుపడ నీయకుండా-

"ఆ...అట్లాగే చేదాం కాని పంతులుగారు రిపోర్టిస్తే బాగుంటుంది" అన్నాడు. ఇంతలో కోమటి రాఘవయ్య వచ్చి అక్కడ కూచున్నాడు.

"మీరు ఈ శ్రమంతా పడడం అనవసరం. నాకు నష్టం గలుగలేదని కాదు. మీరు చందాలు వేసుకొని కొంతసొమ్ము నాకు ఇప్పించి

అనష్టాన్ని పూర్తిచేయలేరు. నన్ను అవమాన పరచగలరు. ఆ పనిమాత్రం చేయవద్దని మిమ్మ ల్నందరినీ బ్రతిమాలుకుంటున్నాను."

"ఇదేం మనిషి? ఇవేంమాటలు?" అని అక్కడ కూచున్న అందరూ అనుకున్నారు.

చిన్న పిల్లలు, "అవును, మా మేస్టరుగారి ఉద్యోగం తీసేశారు. వాళ్లు డబ్బుయిస్తేమాత్రం ఆయన ఎందుకు తీసుకుంటారు?" అని అనుకు న్నారు. పిల్లలంతా అదోరకంగా మోహన్ వంక చూస్తున్నారు. వెంకటేశ్వర్లుకి తనిన్నాళ్ళ నుంచీ తన పంతులుగారిని గురించి అనుకున్న అభి ప్రాయాలలో ఒకటీ సరయింది కాదని రుజు వయింది. రామారావు తన అయిదోఫారం తెలివి నంతా ఉపయోగించినా కోపంవచ్చినపుడు మేస్టారు ఎందుకింత ప్రశాంతంగా ఓడిపోయినట్లు ఉంటారో అర్థంకావడంలేదు.

"జరిగిందేమో జరిగింది. ఇక నేను సెలవు తీసుకుంటాను.

"అంటే..." అన్నాడు చౌదరి. "నేను ఇక్కడినుండి వెళ్లిపోతా."అన్నాడు మోహన్

"అదేంమాట!" అన్నాడు ప్రెసిడెంటు.

"ఉదంతా తరువాత చూసుకోవచ్చు. ముం దర ఇవాళ సంగతి కొంచెం కోపంలేకుండా ఆలోచించి చూడండి" అన్నాడు మునసబు మోహన్‌వంక చూస్తూ.

"ఇలాంటి అవకాశాలు ఎప్పుడూ రావు. అవకాశంతో మనుషుల ప్రవర్తన మారుతుంది. దాంతోనే భవిష్యత్తుయొక్క రూపంగూడా మారుతుంది."

"అంటే...మీరు వెళ్లక తప్పదంటారా?" అన్నాడు ప్రెసిడెంటు.

"తప్పదని మీకు తెలుసు" అన్నాడు మోహన్ ఒక రకమైన నవ్వుతో.

"నాకు తెలియడ మేమిటి?" అని ప్రెసి డెంటు అన్నాడు. కాని కొంచెం ఖంగారుపడక పోలేదు. అనుభవం ఆయన భుజం తట్టి "నే నున్నానుగా" అన్నది.

మళ్లీ మోహన్ అన్నాడు. "ప్రెసిడెంటు గారూ, దయవుంచి ఈ చేతి గడియారం మీకు వీలయినపుడు అమ్మి, ఆ రాఘవయ్యా బాకీ పలభయి రూపాయలు తీర్చండి."

"పోనీ, రాఘవయ్యాకేఇయ్యరాదూ అది" అన్నాడు చౌదరి.

"అట్లా ఎందుకు, ప్రెసిడెంటుగారికి ఇవ్వ డమే మంచిది."

"అంత ముంచుకుపోయిన కారణం ఏమీ లేదు. కొంచెం ఉద్రేకం తగ్గించుకోండి. మరో కొంత కాలంపాటు ఇక్కడ ఉంటే మీకు నిజా నిజాలు తెలుస్తవి"అన్నాడు ప్రెసిడెంటు.

"నిజా నిజాల గొడవ నాకు పట్టలేదు. ఈ సంగతి నాకు పట్టింది. నేను ఇవాళనే యీ ఊరు వదల దల్చుకున్నాను. నాకు ఇష్టం లేకుండా ఇక్కడ ఉంటే మాత్రం ప్రయోజనం ఏమి ఉంటుందీ...కనుక సెలవిప్పించండి."

"మరీ......" అని చౌదరి ఏదో చెప్ప వచ్చాడు. అంతలోనే మోహన్ అందుకుని "అవును, మీకూ కొంచెం డబ్బు ఇవ్వాలి."

"దానికేం లెండి. నేను సర్దుతాగా" అన్నాడు ప్రెసిడెంటు.

"అయితే, నే ననుకున్న దానికంటె అన్నీ సులభంగానే పరిష్కార మయాయి. బెజవాడ పోయే బండికి టైం కూడా అయింది. సెలవు. కమలా...."

"మరి మీ సామాన్లో....." అన్నాడు మునసబు.

"ప్రెసిడెంటుగారింట్లో ఉంటాయి.అయినా చెప్పుకోతగ్గ సామాన్లు ఏమీ లేవు. ఈ టేబిలూ, కుర్చీ...ఆ రెండు మంచాలూ...ఇవి ఎప్పుడో ఒకప్పుడు నా దగ్గరికి వస్తాయి. రాకపోయినా ఇబ్బంది లేదు. సెలవు."

అంటూ ఉన్నవా డున్నట్లే మోహన్ లేచి పోయి కమలను వెంట పెట్టుకుని బయల్దేరాడు బల్లకట్టు సిద్ధంగా ఉన్నది.

బల్లకట్టు ఎక్కుతుండగా, "మీరు ఎప్పుడయినా పంతులుద్యోగం చెయ్యదల్చుకుంటే మావూరే రావాలి" అన్నాడు ప్రెసిడెంట్.

"అట్లాగే..."అన్నాడు మోహన్.పిల్లలంతా బల్లకట్టు అవతలి ఒడ్డుకిపోయి కమలా మోహనులు దిగిపోయేదాకా చూస్తూనిలబడ్డారు. రామారావు స్టేషన్ దాకా పోయాడు. ఏం లాభం? అసలు ఇదేం జరగనట్టే మోహన్ టిక్కట్టుకొని రైలెక్కాడు.